## హాస్యం హాస్యం

# అద్దె కొంప

■ మహర్షి ■

ఒరేయ్ దున్నపోతు వెధవా! త్వరగా నిద్రలేరా ముద్దు సన్నాసీ! ఆఫీసుకు లీవ్ తగలేసి మరో ఇంటికోసం వెదుకుదాంపద.

తలుపు ధన్ ధన్ మని చప్పుడవుతుంటే ఉలిక్కిపడిన ధమాల్ రావు జారిపోతున్న లుంగీ ఎగలాక్కుని నిద్ర కళ్ళను బర బర నలుపుకుని గబగబా వెళ్ళబోయి చీకట్లో ఏదో వస్తువు కాళ్ళ కడ్డం బడి దభీమని బోర్లాపడి ముక్కుతూ లైట్ వేసి చటుక్కున తలుపు తెరిచాడు.

ఎదురుగా ఓనరు పళ్ళు నూరుతూ నిలబడి వున్నాడు.

"మీ పళ్ళు భలే శబ్దాలు వస్తున్నాయ్ ఏమైందండీ?" అన్నాడు ధమాల్ రావు నవ్వుతూ.

"ఏంటెరా కుళ్ళు జోకులేస్తున్నావ్? ఒళ్ళు పేలిపోతుంది జాగ్రత్త" అన్నాడు ఓనరు కోపంగా.

అనుకోని సంఘటనకు బిత్తరపోయాడు ధమాల్ రావు.

"రేపు తెల్లారేటప్పటికి ఇల్లు ఖాళీ వేయకపోతే నీ సామాన్లు వీధిలో వుంటాయి. నా సంగతి తెలియదనుకుంటాను. నేను పరమ కిరాతకుడిని" కయ్ మన్నాడు ఓనరుడు.

ధమాల్ రావ్ బ్రతిమాలగా విషయం చెప్పి ఓ అల్టిమేటం యిచ్చాడు.

"బాబ్బాబు అపరాధమైపోయింది. కనీసం వారం రోజులు టయిమివ్వండి" బ్రతిమాలాడు.

"వారం రోజులు కాదు. రెండు రోజుల తరువాత కూడా మీరిద్దరు ఈ ఇంట్లోనే వున్నట్లు కనబడితే చెప్పింది జరిగి తీరుతుంది జాగ్రత్త" చెప్పి విసురుగా వెళ్ళిపోయాడు ఓనరు.

ధమాల్ రావు మెల్లగా తలుపు మూసి వెనక్కి తిరిగేటప్పటికి రూంమేట్ అవతారం నిద్రమేల్కొని "అర్ధరాత్రివేళ నిద్రలేపి ఏమిట్రా చెబుతున్నాడు" అన్నాడు ముక్కుతూ.

ధమాల్ రావ్ కోపంగా అవతారాన్ని ఒక్క తన్ను తన్నాడు. అతను బాధతో కుయ్యో మొర్రో అంటూ "ఓనరు ఏమన్నాడురా అంటే నన్నే తంటావేమిట్రా చచ్చుపీనుగా?" విసుక్కున్నాడు.

"నిన్ను రూంలోనికి చేర్చుకున్నప్పుడే అనుకున్నాను నీ వల్ల నాకేదో ఉపద్రవం వచ్చి పడుతుందని. నీ మెల్ల కన్ను వేసుకుని బయటకెళ్ళి ఓనరుగారమ్మాయికి కన్నుకొట్టావట కదా! నీ మొహానికి కన్నుకొట్టడం ఒకటి. అవ్వ. ఆయన కాబట్టి వార్నింగ్ యిచ్చి వెంటనే ఇల్లు ఖాళీ వేయమన్నాడు. అయినా ఆ నల్లద్దాలు పెట్టుకుని బయటకు వావవచ్చు కదా! ఇంట్లో వున్నంతసేపు గుర్రానికి గంతలు కట్టినట్లు కట్టెయ్యాలి" అన్నాడు ధమాల్ రావు విసుక్కుంటూ.

★ ★ ★

"ఒరేయ్ దున్నపోతు వెధవా! త్వరగా నిద్రలేరా ముద్దు సన్నాసి. ఆఫీసుకు లీవ్ తగలేసి మరో ఇంటి కోసం వెదకుదాం పద. నువ్వు చేసిన నిర్వాకానికి అనుభవించాలి. లేచి ఆ నల్ల కళ్ళద్దాలు పెట్టుకో. మళ్ళీ తీశావో కళ్ళు పీకి, గొంతు పిసికి మరీ చంపుతాను. ఈ సిటీలో ఇళ్ళు దొరకడం ఎంత కష్టమో తలుచుకుంటేనే భయంగా వుంది".


"వాల్లేరా! నన్ను చూసి ఎవరైనా బంగరంలా ఇచ్చుకుంటారు. పద పద చూద్దువు".

చక చకా తయారయ్యాడు అవతారం.

"నిన్ను చూసే ఇల్లు ఖాళీ వేయమని కొట్టినంత పనిచేసి వార్నింగ్ యిచ్చాడు" అని అవతారం నెత్తిన ఠపీమని కొట్టి బయలుదేరాడు ధమాల్ రావు.

ఓ ఇంటి ముందు నిలబడి "అమ్మా! ఇల్లు ఖాళీగా వుందా?" పెద్దగా అడిగాడు అవతారం.

● "అమ్మా! ఇల్లు ఖాళీగా ఉందా?" గేటు దగ్గర నిలబడిన డమాల్ రావు, అవతారం. . . . . .






ఆ ఇంటి ఓనరు గబగబా బయటకొచ్చి "మనుషులు చూస్తుంటే బాగానే వున్నారు. అడుక్కోవటానికి సిగ్గు అనిపించడంలేదా? వెళ్ళండయ్యా వెళ్ళండి. రోజు రోజుకు మనుషులకు బద్ధకం ఎక్కువ అయిపోతోంది'' విసుక్కున్నాడు.

ఖర్మ ఖర్మ వీళ్ళు మనను అపార్థం చేసుకున్నారులా వుంది పదపద. అంటూ లాక్కుపోయాడు ధమాల్ రావు.

"అడుక్కోవడం ప్రతివాడికి ఫాషన్ అయిపోయింది'' వెనుక అంటున్న ఓనరు మాటలు వారిని దాటిపోలేదు.

"నీ మెల్ల కన్ను నువ్వు నాశనం కాను, చూడు ఎన్నెన్ని అవస్థలో ఎన్నెన్ని మాటలో, నెత్తి మీద దబీ దబీమని బాదాడు ధమాల్ రావు.

"ఇంకా కొట్టు. ఇంకా కొట్టరా బాబు! ఎంత హాయిగా వుందో అలా నువ్వు దరువు వేస్తుంటే'' సంబరంగా చంకలు గుద్దుకున్నాడు అవతారం.

"అఘోరించావు లే పద, అక్కడ పెద్దిల్లు వున్నట్లుగా వుంది. అక్కడ అడుగుదాం'' అంటూ ధమాల్ రావుగబగబా ఈడ్చుకు పోయాడు.

గేటు దగ్గర నిలబడిన ఆమెను ధమాల్ రావు అడగబోతుండగా అంతలో అవతారం కళ్ళజోడు తీశాడు ఆమె అందానికి ఆశ్చర్యపడుతూ.

అంతే! ఆమె బావురుమని ఏడ్చుకుంటూ ఇంట్లోనికి పరుగెత్తింది. మరుక్షణం లోపలనుండి వస్తాదులాంటి మనిషి పరుగున వస్తూ "ఏరా నా చెల్లెలికు కన్ను కొడతారా?'' అంటూ గోడ ప్రక్కనున్న దుడ్డుకర్రను అందుకున్నాడు.

**● నీ చచ్చు జోకులు ఆపి విషయం చెప్పు కోపంగా చూసింది బామ్మ.**

"ఓరి దిక్కుమాలిన సన్నాసి మళ్ళీ కళ్ళజోడు తీశావా?'' అంటూ అవతారం నెత్తిన మళీ దబదబ బాదుకుంటూ పరుగందుకున్నాడు ధమాల్ రావు.

"ఒరేయ్ ఒకటి అగుతాను'' అన్నాడు అవతారం రొప్పుతూ.

"ఏమిటి?''

"నీవలా బాదుతుంటే చాలా హాయిగా వుంది. మరి కాసేపు అలా బాదావంటే హేపీగా ఆ చెట్టు క్రింద ఓ కునుకు తీస్తాను'' ముచ్చటపడుతూ అన్నాడు.

"ముచ్చట పడుతూ ఇక్కడే కూర్చో. వాడొచ్చి ఏ కాలో చెయ్యో విరిసి శాశ్వతంగా మూలన పడేస్తాడు'' అంటూ జుట్టు పట్టుకుని మరీ లాక్కుపోయాడు.

దూరంగా ఓ ఇంటి ముందు టూలెట్ బోర్డు చూసి ఎగిరిగంతేసి ఆ ఇంటి ముందు వాలారు ధమాల్ రావు, అవతారం.

"ఏమిటి నాయనా మరీ అంత సంబడంగా వున్నారు? బోర్డు కనబడగానే ఇల్లు అద్దెకిస్తాననుకున్నారా?'' అందాముసలావిడ గేటులో నిలబడి.

"ఈవెడెవ్రడా అచ్చం లంకిణిలా వున్నది?'' అవతారం గొణిగాడు.

"నువ్వు నోరుముయ్'' అని "నమస్కారం బామ్మగారూ! ఇల్లు అద్దెకిస్తారని కొండంత ఆశతో వచ్చాం. ఎన్ని రూములున్నాయండి'' రెండు చేతులు వినయంగా కట్టుకుని అవతారం కళ్ళజోడు తీయకుండా గమనిస్తున్నాడు ధమాల్ రావు.

"ముందు నా ప్రశ్నలకు సమాధానం చెప్పండి'' అన్నాదా బామ్మ

యక్షిణిలా ఈ యక్ష ప్రశ్నలేమిటో అనుకున్నాడు ధమాల్ రావు.

"మీ ఇద్దరికీ పెళ్ళయిందా?'' మొదటి ప్రశ్న అన్నట్లు ఎడమచేతి బొటన వేలు ముడిచింది.

"మీరు భలే వారు బామ్మగారు. ఈ చచ్చు మొహం వెధవ మగాడే. మగాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారా ఏమిటి విడ్డూరం కాకపోతే'' అన్నాడు ధమాల్ రావు.

"నీ చచ్చు జోకులు ఆపి విషయం చెప్పు'' కోపంగా చూసింది బామ్మ.

తలలు అడ్డంగా వూపారు.

"సరి. మీరు బ్రాహ్మనులా?'' ఎడమచేయి రెండవ వేలు మడిచి అడిగింది బామ్మ.

"కాదండి. కానీ, సంధ్య వార్చడం వచ్చండి'' అని అవతారం స్టైల్ గా కళ్ళజోడుతీయబోయాడు. ధమాల్ రావు గబుక్కున ఆపి బామ్మవైపు తిరిగాడు.

"ఇంకా నయం గంజివార్చడం వచ్చు అనలేదు. నోర్ముయ్. రెండు రూంలు అద్దె వెయ్యి రూపాయలు. కానీ ఒక్కరే వుండాలి. రోజకు బక్కెట్ నీళ్ళు మాత్రం ఇస్తాను. వంట వేసుకోరాదు. లావెటరీ రోజుకు ఒక్కసారే వెళ్ళాలి. రాత్రి ఎనిమిది గంటల తరువాత లైట్ వేయకూడదు. నువ్వు ఇంట్లో వున్నట్లు ఎవరికీ తెలియనంత సైలెంట్ గా వుండాలి. నిద్రలో గురక పెట్టకూడదు. నీ కోసం ఎట్టి పరిస్థితులలోనూ ఎవరూ రాకూడదు. ఆదివారం ఇంటిదగ్గరే వుండవచ్చు. కానీ... ఆమె చెప్పడం పూర్తి చేయకముందే ధమాల్ రావు, అవతారం ఆ వీధి మలుపు తిరిగి చాలాసేపయ్యింది మరి.

"వీరి అసాధ్యం కూలిపోను. ఈ మాత్రానికే అలా పారిపోయారు! మొత్తం వింటే ఏమైపోయేవారో పిచ్చి సన్నాసులు'' అంటూ బుగ్గలు నొక్కుకుంది బామ్మగారు.

పాపం ఇద్దరూ ఆ రోజంతా ఇంటికోసం తిరిగి తిరిగి విసిగి, వేసారి నీరసంగా ఇంటికి చేరారు.

రాత్రి నిద్రలో అద్దె ఇంటి గురించి కలలు

## హాస్యం హాస్యం

కన్నారు. ఇంటి గురించే చర్చించుకున్నారు. మళ్ళీ ఉదయం లేవగానే వేటకు బయలుదేరారు. పైన ఎండ, కడుపులో ఆకలి, ఆపైన విసుగు.

ఓ ఇంటికి టులెట్ బోర్డు చూసిన అవతారం ఆనందంగా అరచి కళ్ళజోడు సవరించుకోబోయాడు. ధమాల్ రావు గబుక్కున అతని ప్రయత్నం విరమింపచేసి "అవతారం! దయచేసి నీ కళ్ళజోడు మాత్రం తీయకురా బాబూ! తపస్సు చేస్తే దేవుడయినా ప్రత్యక్షమవుతాడు. కాని ఇలాంటి బోర్డు కనిపించడంలేదు. ప్లీజ్! ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకుందాం" బ్రతిమాలి ఆనందం పట్టలేక తలుపులు దబదబ బాదాడు.

ఓ నిముషం తరువాత ఒకతను లుంగీ సర్దుకుంటూ మొహమంతా చెమటలు పట్టగా విసురుగా బయటకొచ్చి "బుద్ధి జ్ఞానం వుందా? ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి డిస్టర్బ్ చేయడమేనా? మనిషన్న తరువాత కాస్త ఇంగితం వుండి ఏడవాలి. ఏమిటా నిలువు గుడ్లేసుకుని చూస్తావ్! ఎందుకలా తలుపులు బాదావ్!" కయ్ మన్నాడు. అతను ఓనరో లేక (ఎడిట్) తెలియక కాస్త ఇబ్బంది పడి అతను అలా మాట్లాడేటప్పటికి ఇద్దరి గొంతులు బిగుసుకుపోయి గోడకు వ్రేలాడుతున్న టులెట్ బోర్డు చూపించారు.

"ఖర్మ, ఖర్మ. ఇల్లు ఇచ్చిన తరువాత కూడా దీన్ని తీయక పోవడం బుద్ధి తక్కువైంది" అని విసురుగా బోర్డునులాగి అవతల పడేసి "సరి ఇక వెళ్ళండి" కుక్కలా అరచి దభీమని తలుపు మూసుకున్నాడు.

"పాపం మిట్ట మధ్యాహ్నం అవస్థలు కాబోలు" అనుకున్నాడు ధమాల్ రావు.

మరో ఇంటి ముందు కెళ్ళి అడిగారు చాలా వినయంగా.

"మీరు బాచిలర్సా?" అన్నాడాయన.

"అవును" అన్నారిద్దరు కోరస్‌గా.

"ఛస్తే ఇవ్వను. అసలే మా ఆవిడకు వయసు మీరినా చిన్న పిల్లలా వుంటుంది. వెళ్ళండి, వెళ్ళండి" అన్నాడు తను.

"మేమలాంటి వాళ్ళం కాదండి" బ్రతిమాలాడు ధమాల్ రావు.

"మీరలాంటి వాళ్ళు కాకపోయినా మా ఆవిడ అలాంటిదే. ఇవ్వనుగాక ఇవ్వను".

"ఎవరండి వాళ్ళు? అద్దింటికోసం వచ్చారా? కుర్రాళ్ళు చాలా అందంగా వున్నారులా వుంది పోనీ ఇవ్వండి" లోపలినుండి అతని భార్య కంఠం వినిపించింది.

"వీళ్ళు అద్దె ఇంటి కోసం రాలేదు. ఏదో అడ్రస్ అడుగుతున్నారు అని " ఆ ప్రక్క వీధిలోకి వెళ్ళి అడగండి" అని మొహం మీద దభీమని తలుపులు వేసుకున్నాడు.

★ ★ ★

"ఏమిటి మీరు బాచిలర్సా? నా బొందిలో ప్రాణం వుండగా ఇవ్వను కాక ఇవ్వను. ఎందుకంటే అదో చరిత్ర" అన్నాడా ఇంటి ఓనరు.

"పోనీ మీ బొందిలో ప్రాణం ఎప్పుడు పోతుందో కాస్త చెబుతారా?" అర్థం కాకుండా సణిగాడు ధమాల్ రావు.

"ఏమిటి అలా సణుగుతావ్! ఇవ్వనని చెప్పాను కదా! వెళ్ళండి" విసుక్కున్నాడాయన.

"ఒక్కసారి మీకు ఆడపిల్లలు వుంటే వాళ్ళను, మీ ఆవిడను కాస్త బయటకు పిలుస్తారా?" అన్నాడు ధమాల్ రావు కసిగాచూస్తూ.

"ఎందుకు?" కరకుగా అడిగాడు ఓనరు.

"ఎందుకా? ఓసారి మా అవతారం పెట్టుకున్న కళ్ళజోడు తీస్తాడు. చూసి ఆనందిస్తారు" అని కోపంగా బయటకొచ్చాడు.

ఎంత తిరిగినా బాచిలర్స్‌కు ఇల్లు ఇవ్వం కాక ఇవ్వం అన్నారు. బాచిలర్ అంటే మనిషికాదా? వాడికి మానవత్వం లేదా అని ఆలోచించి, ఆలోచించి ధమాల్ రావు జాబ్‌కు రిజైన్ చేసి అవతారాన్ని వెంటబెట్టుకుని ఇల్లు ఇవ్వనన్న ప్రతి ఇంటికి తీసుకెళ్ళి కళ్ళజోడుతీసి మరీ చూపించి కసిగా, కోపంగా ఎర్ర బస్సెక్కి స్వంత ఊరికెళ్ళి, పంట పొలాలు దున్నుకుంటూ హాయిగా, దర్జాగా, సంతోషంగా బ్రతుకుతున్నాడండోయ్.

మీరు కూడా బాచిలర్సా! అయితే మీరు కూడ ఇల్లు మారేముందు కొంచెం ఆలోచించి నిర్ణయించుకోండి మరి.

(మీరు కూడా ఈ బాపతు బాధితులారా? అయితే మీకు ఈ కథ బాగా నచ్చి వుంటుందనుకుంటున్నాను — అయితే రాయండి — మహర్షి, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి, 38, నాగార్జునహిల్స్, పంజాగుట్ట, హైద్రాబాద్).

## కొత్త వ్యాపకం



పూజాభట్‌కు రక రకాల వస్తువులను సొంతంగా తయ్యారుచెయ్యటం 'హాబీ'గా చేస్తుంటుంది. పాత గ్రామ్‌ఫోను రికార్డులతో 'ఆష్ ట్రే'లను తయ్యారు చేస్తోంది. వాటి అంచులను లైటు ద్వారా వేడిచేసి, వంకీలుగా చెయ్యటంతో అది ఆష్ ట్రేగా ఉపయోగించుకొనేందుకు వీలవుతాయట. ఖాళీ సమయాన్ని ఇలాంటి వ్యాపకాలతో గడుపుతానంటోంది. మరి కమల్ సాధన పరిస్థితేంటో!

## అరెస్టయిన దర్శక నిర్మాత



'అంగార్' చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించిన 'శశిలాల్ నాయర్'ని పోలీసులు భార్య కళ్ళముందే అరెస్టు చేశారు. అతను తన పనిమనిషిని హింసించాడని కంప్లైంట్ ఇవ్వబడింది. అతను ఆమెను ముద్దుపెట్టుకొని రేప్ చెయ్యబోయాడని అందులో వుంది. కోర్టులో కేసు నడుస్తోంది. అతనిని బెయిల్ మీద విడిచి పెట్టారు.